# పడిలేచిన కెరటం

## - గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

**"థాంక్స్,** నువ్వు వచ్చినందుకు. అసలు నువ్వు వస్తావో రావో అని మనసులో సందేహంగానే ఉంది, కానీ వచ్చావు. మంచి పని చేసావ్. నువ్వు వెళ్ళి పోతావని తెలిసినప్పటినుంచి, నేను నిద్ర కూడా పోవడం లేదు.ఇప్పుడు చెప్పు, ఏదైనా మాట్లాడు " అన్నాడు నా కళ్ళల్లోకి చూస్తు.నేను చూపులు తిప్పుకున్నాను.

"మాట్లాడడానికి ఏం ఉంది.ఏం లేదు,." అన్నాను

దెబ్బతిన్నట్టు చూసాడు. ఆర్నవ్ చూపుని. ఎప్పటికీ మర్చిపోలేను

"నాకు తెలుసు, ఆరోజు జరిగిన దానికి,నా మీద అభిప్రాయం మారిపోయింది. అప్పటినుంచి నువ్వు నాతో సరిగా మాట్లాడడం లేదు."

నేను మౌనంగా ఎటో చూస్తూ ఉండిపోయాను.

"ఆరోజు జరిగినదానికి నీకు చాలా సార్లు సారీ చెప్పాను,ఇంకా ఆ కోపమే ఉందా?"

"కాదు,అదేం లేదు " అన్నాను అది పైకే,కానీ లోపల చాలా కోపం ఉంది.

ఆరోజు రాత్రి జరిగింది గుర్తు తెచ్చుకోవాలని లేదు. కాని,ఇప్పుడు ఆర్ణవ్ మళ్ళీ ఆ విషయాన్ని ఎత్తి గుర్తు చేసాడు.నిజానికి నేనూ మర్చి పోలేదు.అది మర్చిపోయే సంఘటన కాదు కదా. పెద్ద ప్రమాదం తప్పిన రోజు.

ఆ రోజు. డిసెంబర్ ముప్పై ఒకటి రాత్రి. కొత్త సంవత్సరం పార్టీ ఇస్తానని రమ్మన్నాడు. అదో పెద్ద హొటల్ అని అన్నాడు. నేను పెద్ద హొటళ్ళు ఎలా ఉంటాయో ఎప్పుడూ చూళ్ళేదు. ఓ సారి చూద్దామన్న ఉత్సాహంతో సరే అన్నాను. ఆ ఉత్సాహంలో చేస్తున్నది తప్పో ఒప్పో కూడా ఆలోచించలేదు. పైగా మోటార్ సైకిల్ మీద ఎప్పుడూ వెళ్ళలేదు.ఆ సరదా ఇప్పుడు తీర్చుకోవచ్చు, ఆ తీసుకెళ్తున్నది, ఆర్ణవ్ కాకుండా మరొకరు, తెలిసున్న మనిషి అయినా నేను వెళ్ళేదాన్ని. ఓ అబ్బాయితో వెళ్తున్నానని నిజం చెప్తే అమ్మ పంపించదు. అందుకని, ఇంట్లో అమ్మా వాళ్ళకి అబద్ధం చెప్పాను, సువర్ణా వాళ్ళు హాస్టల్లో కొత్త సంవత్సరం సెలిబ్రేట్ చేసుకుంటున్నారని ,అన్నాను.అమ్మ ఏం అనలేదు. తొందరగా వచ్చేసెయ్యి అని అంది.సరే అన్నాను. అమ్మని మోసం చేస్తున్నానని కొంచెం బాధ పడ్డాను.

కాని ఎంతో ఉత్సాహంగా ఆర్ణవ్ ని కలుసుకున్నాను. బైక్ మీద కూచోవాలన్న నా కోరిక తీరుతోంది. వెనకాల కూచున్నాను. చలిగాలిలో నేను, ఆర్ణవ్ బైకు మీద జాగ్రత్తగా మా మధ్య కొంచెం స్థలం ఉంచి దూరంగా ఒళ్ళు తగలకుండా వెనకాల కూచున్నాను. తేలిపోతున్నట్లుగా ఉంది. సినిమాలో లాగా మెడని వెనక్కి వంచి రెండు చేతులూ బాగా చాచాను. మొదట్లో భయం వేసినా తరవాత బాగా

ఉన్నట్టునిపించింది. నున్నటి రోడ్డు మీద వెళ్ళడం నాకు ఎంతో బావుంది. అటూ ఇటూ చెట్లూ, పొలాలు అంతా చీకటి. పైన నక్షత్రాలతో అందంగా ఉన్న నీలాకాశం. రివ్వున వీస్తున్న గాలి.. ఎంతో హాయిగా ఉంది. తొందరగా ఆ హొటల్ రాకుండా ఉండాలి అనుకున్నాను. అలాగే వెళ్తూ ఉంటే బావుంటుందని అనిపించింది. కాని,ఆ హొటల్ వచ్చింది. గోడలకి, పొదలకి, చెట్లకి అన్ని చోట్లా రంగురంగుల జిగేల్ జిగేల్ మంటున్న లైట్లున్నా మూల మూలల్లో అంతా చీకటి చీకటిగానే ఉంది. అది హొటల్ కాదు, ఏదో రిసార్ట్స్ అని అక్కడ ఉన్న బోర్డులని బట్టీ తెలిసింది.

విశాలంగా ఉన్న ఆవరణ నిండా కార్లూ,మోటారు సైకిళ్ళు. ఎన్నో సార్లు స్కూల్లో, కాలేజీలో ఫ్రెండ్స్ తో ఏదో ఒక సందర్భంగా ,మామూలు కాంటీన్లకి, రెస్టారెంట్లకి హొటళ్ళకి వెళ్ళాను. కాని ఇలా రిసార్ట్స్ కి , పైగా ఊరికి దూరంగా ఉన్న దానికి వెళ్ళడం ఇదే మొదటి సారి. అందుకే చాలా ఎక్సైట్ అయ్యాను. చాలా దూరం నడిచాకా ఓ అందమైన బిల్డింగ్ లాంటి హొటల్ వచ్చింది. అంతా పట్ట పగలులాగా ఉంది. రిసెప్షన్ దాటి లోపలికి వెళ్ళాము.

లోపల అంతా చీకటి గా ఉంది. ఏం కనిపించడం లేదు. సినిమాల్లో చూపించే ఏదో విలన్ల మాయా లోకంలా భయంకరంగా ఉంది.ఒక్క క్షణం భయపడ్డాను. పైనా కిందా పక్కనా అన్ని చోట్లా రంగు రంగుల లైట్లు. ఆరుతూ వెలుగుతూన్న లైట్లూ, డిమ్ గా ఉన్న లైట్లు, మసక వెలుతురు. ఎక్కడైనా పడతానేమో అని భయపడ్డాను. అయితే ఆర్ణవ్ నా చేయి పట్టుకుని నడుస్తున్నాడు. అది నాకు తప్పనిపించ లేదు. ఎందుకంటే అసలు దారి ఏం కనిపించడం లేదు. దానికి తోడు అంతా పొగ. కళ్ళు ఆ చీకటికి వెలుగుకి అలవాటు పడ్డాకా, కొంచెంగా కనిపించడం మొదలైంది. చుట్టూ చూశాను. అది చాలా పెద్ద హాలు. చీకటి వెలుగుల మధ్య కదులుతున్న మనుషులు. ఊగిపోతున్న మనుషులు,తాగుతున్న మనుషులు. అస్పష్టంగా కనిపిస్తున్న మనుషులు జంటలుగా డాన్స్ చేస్తున్న వాళ్ళు. ఎవరి మొహాలూ స్పష్టంగా కనిపించడం లేదు. ఆ హాలంతా సిగరెట్ల పొగ, ఆల్కోహాల్ వాసన తో నిండి ఉంది. భరించ లేక పోయాను. తల తిరిగుతునట్లుగా, వికారంగా అనిపించింది, చెవులు బద్దలయ్యేలా పంజాబీ ,హిందీ పాటలు. ఒక్కసారిగా ఆర్ణవ్ నన్ను గట్టిగా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు. ఓ సారి తనని చూసి చటుక్కున అతడి పట్టుని విడిపించుకున్నాను. చెయ్యి విదిలించుకున్నాను. ఆశ్చర్యంగా చూసాడు.

"న్యూ ఇయర్ సెలిబ్రేషన్ ఇలాగే ఉంటుంది " దగ్గరగా వచ్చి చెవిలో అన్నాడు.

"నాకు ఇలాంటివి నచ్చదు " అంటూ పక్కకి జరిగాను.ఆర్ణవ్ అదేం పట్టించుకోలేదు.

"నచ్చదంటే ఎలా.న్యూఇయర్ సెలిబ్రేట్ చేసుకుంటే బావుంటుందని ఇక్కడికి తీసుకొచ్చాను. ఎంజాయ్ చేద్దాం. మనం కూడా డాన్స్ చేద్దాం. పద " అంటూ మళ్ళీ నా నడుము మీద చేయి ఓ అడుగు ముందుకి వేసాడు. వెంటనే ఆర్ణవ్ ని ఒక్క తోపు తోసి గబగబా పరుగు లాంటి నడకతో బయట లాబీలోకి వచ్చేసాను. ఆర్ణవ్ కూడా నా వెనకాలే వచ్చాడు. నన్ను ఆపాడు.

"ఏం జరిగింది? "అని రెండుసార్లు అడిగాకా చెప్పాను.

"చూడు ఆర్ణవ్ , నాకు ఇలాంటి వాతావరణం నాకు నచ్చదు. నేను లోపల ఉండలేక పోతున్నాను. అయినా నువ్వు నన్ను ఇలాంటి చోటుకి తీసుకొస్తావని అసలు అనుకోలేదు. పైగా హొటల్ అంటే నేను వేరే గా ఊహించుకున్నాను. మేం చూసిన రెస్టారెంట్లకన్నా ఇంకాస్త బావుంటుందని అనుకున్నాను. నాకిలాంటి హొటళ్ళూ తాగడాలూ. డాన్సులాడడాలు అవీ నచ్చదు " అని కోపంగా అని బయటికి వెళ్ళడానికి తయారయ్యాను. నా వెనకాలే గబగబా వచ్చి చేయి పట్టుకుని ఆపాడు. నేను ఆగిపోయాను.

కాస్సేపు మాట్లాడ లేదు. వెంటనే ఇంటి దగ్గర దింప మన్నాను. నిశ్శబ్దంగా బయటికి వచ్చి బైకు దగ్గరికెళ్ళి స్టార్ట్ చేసాడు. వెనకాల కూచున్నాను. ఆ కూచోడంలో వచ్చేటప్పుడున్న ఎక్సైట్ మెంటు ఇప్పుడు లేదు. యాంత్రికంగా కూచున్నాను. నన్నుఇంటి దగ్గర దింపేసాడు..

" టైము ఎనిమిది కూడా కాలేదు, అప్పుడే వచ్చేసావేంటీ ? " అని అమ్మఅడిగితే ఏదో సద్ది చెప్పేసాను. ఆ మర్నాడు పేపర్లో అంతకు ముందు రాత్రి మేము వెళ్ళిన రిసార్ట్స్ లో రైడ్ జరిగిందని, చాలా మందిని అరెస్ట్ చేసారని.,అక్కడ యువత డ్రగ్స్ కూడా తీసుకున్నారని, కొంత మంది ప్రైవేసీ కోసం అని,రూములు కూడా బుక్ చేసుకున్నారని అసభ్య, అసాంఘీక కార్య కలాపాలకి పాలుపడ్డారని ఫొటోలతో సహా పేపర్లో వచ్చింది. అంతా మొహాలు కప్పుకుంటూ నడుస్తున్న ఫొటోలు.

ఆ రోజున అమ్మ ఓ పెద్ద లెక్చర్ తీసుకుంది. "చూడు నా పెంపకం ఎలా ఉందో. ఓ వయసొచ్చిన పిల్లలని చాలా జాగ్రత్తగా పెంచాలి. ఎక్కడికెళ్తోందో ఎవరితో వెళ్తోందో అన్నీ గమనిస్తూండాలి. అన్నీ కనుక్కోవాలి. నేను నిన్ను అలాగే పెంచాను కాబట్టి ఇంటికి తొందరగా వచ్చావు . ఆ మాత్రం భయం ఆడపిల్లకి ఉండాలి." అని, నన్ను మెచ్చుకొని పట్టుబడ్డ మిగిలిన ఆడ పిల్లలని వాళ్ళ పేరెంట్స్ ని విమర్శించింది.

అమ్మకి తెలీదు నేను కూడా అక్కడికి వెళ్ళానని. ఒక వేళ నేను కూడా ఆర్ణవ్ తో అక్కడ ఉండి ఉంటే నా పేరు కూడా బయటికి వచ్చేది. నా ఫొటో కూడా వచ్చేది. అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్ళిన వాళ్ళల్లో నేను కూడా ఓ ముసుగు వేసుకుని ఉండే దాన్ని. ఆ ఊహే చాలా భయంకరంగా అనిపించింది.

ఒక్క విషయం అర్థం కాలేదు. ఆర్ణవ్ ఎందుకలా చేసాడు? నాకంటే తెలీదు,పెద్ద హొటళ్ళు రిసార్ట్స్ ఎలా ఉంటాయో, ఆర్ణవ్ కి కూడా తెలీదా? కనుక్కో లేదా!,అన్నీ తెలుసు. వాతావరణం ఎలా ఉంటుందో కూడా తెలుసు .అయినా తీసుకెళ్ళాడు. తెలిసీ కూడా అసలు అలాంటి చోటుకి నన్ను ఎందుకు తీసుకెళ్ళాలీ? నేను ఎలాంటి వాతావరణంలో పెరిగానో, మా కుటుంబం కన్సర్వేటివ్ అని కూడా తెలుసు. అయినా నన్ను ఏం అనుకున్నాడు.? పిలవగానే వస్తానన్నానని కదా అని ఇలాంటి హొటలుకి తీసుకొస్తాడా? ఫ్రెండంటే మంచిగా ప్రవర్తించగలగాలి, ఎంత డిగ్నిఫైడ్ గా ఉండాలి!? ఇలాంటి వాటికి ఇష్టపడి వెళ్ళే వాళ్ళుంటారు. ఎంత చదువుకున్నా నేను ఇంకా అంత ప్రోగ్రెసివ్ కాదు.

ఏదైనా ఆర్ణవ్ మనసు తెలిసింది. ఏ మాత్రం చనువిచ్చినా ఉపయోగించుకునే రకం అనిపించింది. ఇక మీదట కాస్త జాగ్రత్తగా ఉండాలి. నా గురించి ఎక్కువగా ఊహించద్దని చెప్పేయాలి. ఇంక మాట్లాడ కూడదని అనుకున్నాను. నిజంగానే ఆ తరవాత కోపంతో చాలా రోజులు ఆర్ణవ్ తో మాట్లాడ లేదు. ఎన్నిసార్లో సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ఎన్నోసార్లు బతిమాలాడు. జరిగింది మర్చిపొమ్మన్నాడు. మామూలుగా అయిపోయినట్లు నటించినా అది పైపైనే. కానీ నేను మాత్రం మర్చిపోలేదు.

ఇన్నాళ్ళ తరవాత ఈ నందినీ రెస్టారెంట్ లో, ఇప్పుడు మళ్ళీ గుర్తు చేసాడు. పైగా ఇది జరిగి ఓ నాలుగు నెలలు అయిందనుకుంటాను.

"ఇప్పుడు ఆ కోపం మనసులో పెట్టుకున్నావా? కొత్త సంవత్సరం మనం బాగా ఎంజాయ్ చేయాలని అక్కడికి తీసుకెళ్ళాను. అంతే నిన్ను బాధించాలని కాదు.అప్పటి ఆ కోపం ఇంకా ఉందా? నిజంగానువ్వు వెళ్ళిపోతావా? నేనంటే నీకిష్టం లేదా? మళ్ళీ ఈ అవకాశం నాకు

వస్తుందో లేదో, నిజం నేను నిన్ను ప్రేమిస్తున్నాను, నీ కోసం ఏం చెయ్యమన్నా అది చేస్తాను ప్లీజ్ ఇక్కడే ఉండిపో " మళ్ళీ ఆ గొంతులో బాధ. నేను గమనించాను.

"నీకు ఇదివరకే చెప్పాను. నువ్వు దీన్ని మళ్ళీ మొదటికే తీసుకు రాకు. ఇష్టం వేరు. ప్రేమ వేరు. మనది స్నేహం మాత్రమే. అంతకు మించి మరేం లేదు " గట్టిగా చెప్పేసాను.

" కాని నేను నిన్ను ప్రేమించాను. మనం పెళ్ళి చేసుకుందాం. మన పెళ్ళికి నా వైపు నుంచి అభ్యంతరం ఏమీ లేదు. నాకు అమ్మా నాన్నా లేరు. ఉన్నది ఒక్క బామ్మ. ఆమెకి నీ విషయం చెప్పాను. అందుకని నువ్వు వెళ్ళే లోపు ఏదో ఒకటి క్లియర్ చేసుకుందాం. మీ వాళ్ళని నేను ఒప్పిస్తాను. నువ్వు ఎవరికీ భయపడాల్సింది లేదు. ఈ ఏడాదితో నా డిగ్రీ అయిపోతుంది. ఏదో ఉద్యోగం వస్తుంది. మనం హాయిగా ఉందాం. నువ్వు సరే అను " ఆవేశంగా అన్నాడు, నా చేతిని పట్టుకుంటూ. ఆ ఆవేశం చూసి కొంచెం భయపడ్డాను.

" ఏంటీ పిచ్చి,పెళ్ళేంటీ. ఆ ఆలోచన ఎలా వచ్చింది నీకు? నీకిదివరకే చాలా సార్లు చెప్పాను, ఇష్టం వేరు, ప్రేమ వేరు అని" కోపంగా అన్నాను.

" పిచ్చా పిచ్చేంటీ! ఇది చాలా సీరియస్ సబ్జెక్ట్. నేను చాలా సీరియస్ గా ఉన్నాను "

మరో సారి షాక్ తిన్నాను. ఆ మొహం, ఆ చూపు చూస్తే ఎందుకో కాస్త భయం వేసింది. అయోమయంగా చూసాను. అంత సీరియస్ గా ఉన్నాడా. ఏంటీ పిల్లాడు!

"కాదు శృతీ నా దృష్టి లో ఇష్టం,ప్రేమ రెండు వేరే కాదు. మొదట స్నేహం చేసినా తరవాత అది ఆకర్షణ అయింది. అది ప్రేమగా మారింది. ఈ ప్రేమ ఎప్పుడు మొదలైందో నాకు తెలీదు. ఇప్పుడు నువ్వు వెళ్ళి పోతున్నావు దానికి ఓ ఆకారం వచ్చింది. అందుకే అంటున్నా పెళ్ళి,చేసుకుందాం అని . ఈ విషయం అందరికీ తెలవాల్సిన పని లేదు. నీకు అంతగా భయంగా ఉంటే సీక్రెట్ గా కోర్టు మారేజ్ చేసుకుందాం. కాదంటే నువ్వు ఇక్కడే ఉండి చదువుకో. ఏదో ఒకటి చెయ్యి "

కోపం తన్నుకొచ్చేస్తోంది. ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలి.

"సారీ, నాకిలాంటివి ఇష్టం లేదు. నేను వెళ్ళాలి, మీ మొగపిల్లలు ఎప్పటికీ మారరు. మీ దృష్టి కూడా మారదు. స్నేహం అంటే పెళ్ళికి ఓ మొదటి మెట్టు అనుకుంటారు. అసలు నా గురించి ఏం తెలుసు నీకు,అలాగే నీ గురించి నాకేం తెలీదు. సారీ! "అంటూ లేచాను.

ఒక్కసారి చేయిని పట్టుకున్నాడు. వదిలించుకున్నాను. మళ్ళీ పట్టుకున్నాడు . నా మొహంలోకి చూస్తూ ఉండిపోయాడు.

" అలా అనకు శృతీ ,ఒకళ్ళ గురించి ఒకళ్ళకి తెలియకపోయినా ఇది వరకూ పెద్ద వాళ్ళు చేసిన పెళ్ళిళ్లు సక్సెస్ అవడంలేదా? పెళ్ళయ్యాకా అన్నీ తెలుస్తాయి. అదంతా ఎందుకు?నీకు నేనంటే ఇష్టం. ప్రేమ ఉంది అది నాకు తెలుసు. అందుకే నేను నీ పుట్టినరోజుకి ,పండగలకి గ్రీటింగ్స్ ఇస్తే తీసుకున్నావు కదా! " అన్నాడు,నావైపు చూస్తు.

ఒక్కసారిగా నోరు తెరిచాను. ఎటునుంచి ఎటు వెళ్తున్నాడు? తీసుకోడం తప్పయిపోయిందా? దాని అర్థం మార్చుకున్నాడా?

"నిజమే తీసుకున్నాను. నా పుట్టినరోజున,పండగలకి చాలా మంది ఇచ్చారు. ఓ స్నేహితుడుగా నువ్వు ఇచ్చావని తీసుకున్నాను. అంతే. నువ్వు సువర్ణ కజిన్ వి, నా స్నేహితుడివి ,సువర్ణ ఎంతో నువ్వు కూడా అంతే. ఇద్దరి మీదా ఒకేలాంటి ఇష్టం, నీ మీద ఇష్టం అనేది ఏంటో నాకే స్పష్టంగా తెలీదు. అది స్పష్టం అవడానికి కొన్నేళ్ళు పడుతుంది. అయినా ఇలాంటి వాటికి ఇంకా చాలా కాలం ఉంది. ఇప్పుడు నాకు నాచదువు, నాకు నా కెరీర్, నా పేరెంట్స్ ముఖ్యం అంతే. పైగా నా కల మెడిసిన్ అది సాకారం చేసుకోవాలి "

" అయితే నీ కోసం జీవితాంతం వెయిట్ చేస్తాను. నువ్వు సరే అను. నీ చదువు , కెరీర్ ఓ ట్రాక్ లో పడ్డాకే చేసుకుందాం. సరే అను " కళ్ళు చిన్నగా చేస్తూ అన్నాడు

ఎలా అంటాను?అనలేను. నాకు జీవితం మీద ఎన్నో ఆశలున్నాయి. కలలున్నాయి. పెళ్ళి అన్నది అందులో లేదు. అందుకని ప్రామిస్ ఎలా చేస్తాను? ఆర్నవ్ ఓ స్నేహితుడు మాత్రమే. అంతే. అందులో అంతకు మించిన ఇష్టం లేదు. ఏ అభిప్రాయమూ లేదు.

మాట్లాడినంత మాత్రానా ప్రేమించేయడమేనా? దాన్ని ప్రేమ అని అనుకుంటాడా? తన లాగే నేను కూడా అనుకోవాలా? దాన్నే ప్రేమ అని ఎలా చెప్తాను? ప్రేమిస్తున్నానని ఎలా చెప్తాను ? ఇంత వరకూ ఇలాంటి టాపిక్ రాలేదు . లేకపోతే ఎప్పుడో చెప్పేదానిని. చాలా సేపు ఏం మాట్లాడ లేదు.

" పోనీ టచ్ లో ఉండు. అదొక్కటే నేను అడిగేది "

"దానిలో ఉన్న లోతు నాకు అప్పుడు తెలియలేదు. ఇంక నేను వెళ్ళాలి" అని లేచాను. ఆర్నవ్ ని బాధ పెడ్తున్నానిపించింది. కాని ఇది నా జీవితం.నా ఫ్యూచర్. పైగా ఇప్పుడు నా వయసు పంతొమ్మిది. ఇది పెళ్ళిచేసుకునే వయసు కాదు. జీవితానికి ఓ అర్థం ఇచ్చుకునే దారిలో వెళ్ళడానికి తయారవుతున్నాను.

మరోసారి ఎంసెట్ రాయడానికి సిద్ధం అవుతున్నాను. బిఎస్సీ పూర్తి చెయ్యాలి. అలాగే పూర్తి కావలసిన కలలు కూడా ఉన్నాయి. ఆర్నవ్ కన్నా ఎంతో పెద్దవి నా కలలు, నేను, మెడిసిన్ చదవాలన్న కోరిక, నన్ను కన్న నాతల్లి దండ్రులు, ఇవన్నీ నా ముందున్నాయి. ఈ ఊరు దాటి వెళ్తున్నంత మాత్రాన నా కలల్ని ఎలా ఆపెస్తాను?

లేచాను. ఆర్ణవ్ కి సమాధానం చెప్పలేదు. ఆర్ణవ్ మొహం పాలిపోయింది.

" ఇంకొంచెం సేపు కూచోకూడదా?"

" ఉహూ .లేదు నాకు చాలా పనుంది, నా పుస్తకాలూ అవీ సద్దుకోవాలి, వాటిని పాక్ చేసుకోవాలి. రేపు పాకర్స్ వాళ్ళూ వస్తారు " అని కుర్చీని వెనక్కి తోసి ఓ అడుగు ముందుకేసాను.

" ఒక్క నిమిషం ఆగు శృతీ! నీకోసం తెచ్చాను. కనీసం ఈ లెటర్ గ్రీటింగ్,తీసుకుంటావా? ప్లీజ్! " ప్రాధేయ పడుతున్నట్టుగా అన్నాడు.

" సరే. ఓ స్నేహితుడు ఇచ్చినట్టుగా తీసుకుంటాను. ఇలా తీసుకున్నందుకు ఎక్కువగా ఊహించకు. గుడ్ బై " అంటూ తిరిగాను.

నాతో పాటూ ఆర్నవ్ లేవలేదు అక్కడే కూచుండి పోయాడు. ఒక్క క్షణం వెనక్కి తిరిగి, “మనది స్నేహం మాత్రమే అందులో ప్రేమ లేదు. స్నేహానికి అర్ధాన్ని మార్చకు” అని మరోసారి చెప్పాలనిపించింది. కానీ ఈ సంగతి ఇదివరకూ కూడా చెప్పాను. తనకి అర్ధం అవడం లేదు. రెస్టారెంటులోంచి బయటికి వచ్చాను. ఇంక ఆ తరవాత ఏం ఆలోచించలేదు. ఇంటికెళ్ళాకా ఆ ఉత్తరాన్ని గ్రీటింగ్ ని ఏదో ఎదురుగా కనిపించిన ఓ పుస్తకం లో పెట్టాను.ఆ సంగతి అప్పుడే మర్చిపోయాను.

ఆ మర్నాడు మా పక్కింటి వాళ్ళు, బ్రేక్ ఫాస్ట్ కి పిలిస్తే అమ్మా నాన్నగారు వెళ్ళారు. నేను ఇంట్లో ఉండి పోయాను. ఫోన్ మోగింది. తీసాను. అవతల సువర్ణ.

“.....నువ్వు తనని కలుస్తావని ఆర్ణవ్ కి చెప్పాను. కలిసావా?”

“ఆఁ సాయంత్రం కలిసాను ”

“ ఏం జరిగింది? ఎంత సేపు గడిపావ్? ఏం మాట్లాడావ్? “

దీని కోసం ఫోన్ చేసిందా? ఏంటీ ప్రశ్నలు? చిరాకేసింది.

“ఎంత సేపేంటీ, ఓ నలభై నిమిషాలు. ఏం మాట్లాడానా నీతో ఇదివరకూ అన్నదే. ఆ తరవాత వెంటనే చీకటి పడకుండా వచ్చేసాను. అయినా చూడు సువర్ణా! నేను మీ లాగా హాస్టల్ లో ఉండడం లేదు. నేను అమ్మా వాళ్ళ దగ్గర ఉంటున్నాను, ఏ మాత్రం ఆలస్యం అయినా ఎన్నో ప్రశ్నలు వేస్తారు. వాటికి జవాబులు ఇచ్చుకోవాలి. దీనికోసం ఇప్పుడు నువ్వు ఫోన్ చేసావా? “

“లేదు. శృతీ దానికోసం చెయ్యలేదు. ఆర్ణవ్ నిన్న సాయంత్రం నుంచి కనిపించడం లేదుట, రాత్రి కూడా ఇంటికి రాలేదుట. ఆర్ణవ్ బామ్మ కంగారు పడ్తోంది. పోలీసులకి రిపోర్ట్ ఇప్పుడే ఇచ్చారు. వాళ్ళు వెతుకుతున్నారు ”

ఒక్కసారి తల తిరిగినట్లయింది. భయపడిపోయాను. గుండె ఆగినట్లయింది. కనపడడం లేదా? ఎక్కడికి వెళ్ళాడు? వెంటనే ఏం సమాధానం ఇవ్వ లేకపోయాను. అతి కష్టం మీద నోరు పెగిలింది.

“నిన్న సాయంత్రం రెస్టారెంటులో కలిసాను, అది కూడా ఒక నలభై నిమిషాలు మాత్రమే. నాకు పాకింగ్ ఉంది.అందుకోసం వచ్చేసాను. అంతే ”

“అంతేనా?” రెట్టించి అడిగింది.

“అంతే. నేను చెప్పాల్సింది చెప్పేసి వచ్చేసాను. నాతో పాటూ తను బయటికి రాలేదు. నేను ఇంక వెనక్కి తిరిగి చూడలేదు. నేను అన్నది తప్పో ఒప్పో కానీ నా మనసంతా అలజడిగా ఉంది. గబగబా ఇంటికి వచ్చేసాను. ఆ తరవాత ఏం జరిగిందో నాకు తెలీదు ” అన్నాను భయంగా.

వెంటనే సువర్ణ ఫోను పెట్టేసింది.

ఏం చేయాలో అర్థంకావడం లేదు. అర్ణవ్ కనపడక పోవడానికి నాకూ ఏం సంబంధం లేదు. ఈ విషయం అర్ణవ్ బామ్మకి చెప్పాలి. ఇంట్లో అమ్మ కూడా లేదు. కాబట్టి ఫోన్ చేయచ్చు. కానీ ఎక్కడో భయం ,ఎందుకో భయం. ఫోన్ దగ్గరికి వెళ్ళాను, కానీ చెయ్యలేకపోయాను. అక్కడే నుంచున్నాను.

ఎలాగైనా ఆర్నవ్ ఇంటికి ఫోన్ చేసి, వాళ్ళ బామ్మకి అంతకు ముందు రోజు మా ఇద్దరి మధ్య ఏం జరిగిందో చెప్పాలనిపించింది. దానికి అర్ణవ్ కనిపించక పోవడానికి ఏం సంబంధం లేదని చెప్పాలి.

కాని దాని వల్ల లాభం ఏం ఉండదు అని తెలుసు. ఏ ఫ్రెండు తోనో కలిసి బాగా తాగి ఉంటాడు అలా ఎన్నో సార్లు జరిగింది. ఆ సంగతే తనే చెప్పాడు. బామ్మకి భయపడి ఇంటికి వెళ్ళకుండా ఆ ఫ్రెండ్ గదిలోనే ఉండి పోయి ఉంటాడు. ఇలా ఇదివరకూ కూడా జరిగింది,బామ్మకి భయపడి ఇంటికి వెళ్ళలేదు అని అన్నాడు. ఇప్పుడు కూడా అదే జరిగి ఉంటుందని అనిపించింది. నా తిరస్కృతిని తట్టుకోడానికి ఎక్కువగా తాగి ఉంటాడు. ఏఫ్రెండ్ ఇంట్లోనో రోజంతా గడిపేసి ఉంటాడు,అని ఎంత అనుకున్నా ఏదో జరిగిందనిపిస్తోంది.

అయితే ఇందులో నా తప్పుందా? తనతో స్నేహం చేయడం తప్పా? ఆ స్నేహాన్ని అపార్థం చేసుకుంటే నేనేం చేయలేను. కానీ ఎందుకో లోపల్నుంచి ఏదో బాధ. రాత్రంతా రాలేదా? ఎక్కడికి వెళ్ళి ఉంటాడూ!? నిజంగా నా మాటల మూలంగానే వెళ్ళిపోయాడా? నేనేం అన్నాను? నా మనసులో మాట చెప్పాను అంతే. దానికి ఇంత కఠినంగా వ్యవహరిస్తాడా?

ఆ రోజు నా బట్టలూ పుస్తకాలూ డైరీలూ అన్నీ సద్దుకుంటున్నాను, కాని మనసు మనసులో లేదు. ఆర్నవ్ గురించే ఆలోచిస్తున్నాను. దొరికాడో లేదో, ఎక్కడున్నాడో, ఏ స్థితిలో ఉన్నాడో, ఎలా తెలుస్తుంది? ఎవర్నైనా అడగాలంటే భయం. అందుకే నా స్నేహితురాళ్ళతో మాట్లాడ లేదు. కలవలేదు. ఎక్కడ అర్ణవ్ ప్రస్తావన వస్తుందో ఏం వినాల్సి వస్తుందో అని.ఆ రోజంతా అలాగే అన్యమనస్కంగానే గడిపాను.

మర్నాడు ఉదయం అమ్మ పేపరు చూస్తోంది. ఆమెకి పేపరు చదువుతూ మధ్య మధ్య కొన్ని వార్తలు పైకి చదవడం, చెప్పడం అలవాటు. ఎప్పటిలాగా ఆ రోజున కూడా అలాగే గట్టిగా చదువుతోంది. నాన్నగారు టీవీ చూస్తూ అమ్మ మాటలు వింటున్నారు. నేను కూడా అక్కడే కూచుని కాఫీ తాగుతున్నాను.

కానీ నా ఆలోచనలన్నీ కూడా ఆర్నవ్ మీదే. రెండు రాత్రుళ్ళు గడిచాయి. ఎక్కడున్నాడో? అసలు ఇంటికి వచ్చాడో లేదో? వస్తే పరవాలేదు. రాకపోతే. మళ్ళీ భయం వేసింది. పోనీ ఓసారి వాళ్ళింటికి వెళ్తే తెలుస్తుంది. అర్ణవ్ వచ్చాడో లేదో, ఇంకా నా మీద కోపంగా ఉన్నాడా? బామ్మ దగ్గరికి వెళ్ళనా.? అమ్మకి తెలీకుండా వెళ్ళనా..!? కష్టం. అమ్మకి చెప్పి వెళ్ళాలి. చెప్తే ఒప్పుకోదు. అందుకని వెళ్ళాలన్న ఆలోచనని తీసేసాను.

"శృతీ, మేఘనా కాలేజీలో పిల్లలు ఎవరైనా నీకు తెలుసా? ఎవరో ఓ అబ్బాయి ఆ కాలేజీ వాడేట, సుబ్బరంగా తాగేసి,ఒళ్ళూ తెలీకుండా బండి తోలేస్తే ఏం జరుగుతుందో అదే జరిగింది. ఆ వార్తే దీన్లో వచ్చింది. ఆ పిల్లాడి ఫొటో కూడా వేసారు. పాపం చిన్నవాడే."

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments